క్లుప్తంగా

వర్గీకరణ బిల్లుకు చట్టబద్ధత కల్పించాలి



జగ్జీవన్‌రామ్‌కు నివాళులర్పిస్తున్న మహాజన సోషలిస్ట్ పార్టీ నాయకులు

కాకినాడ సిటీ: ప్రస్తుత పార్లమెంట్ సమావేశాల్లో ఎస్సీ వర్గీకరణ బిల్లుకు చట్టబద్ధత కల్పించాలని డిమాండ్ చేస్తూ ఏప్రిల్ 4న రెండు తెలుగు రాష్ట్రాల్లో జాతీయ రహదారులను దిగ్బంధించాలని నిర్ణయించినట్టు మహాజన సోషలిస్ట్ పార్టీ నాయకులు వల్లూరి సత్తిబాబు, పలివెల నవీన్, కాకాడ నూకరాజులు పిలుపు నిచ్చారు. గురువారం కాకినాడలో బాబూ జగ్జీవన్‌రామ్ విగ్రహం వద్ద ఈ మేరకు నిరసన వ్యక్తం చేశారు. ఈనెల 19న కాకినాడ జిల్లా తుని నియోజకవర్గం రావికంపాడులో డాక్టర్ బాబూ జగ్జీవన్‌రామ్ విగ్రహావిష్కరణకు మందకృష్ణ మాదిగ రానున్నారని అన్నారు. కార్యక్రమంలో మహాజన సోషలిస్ట్ పార్టీ నాయకులు దూలపల్లి వెంకటరమణ, నరుకుర్తి రాజు తదితరులు పాల్గొన్నారు.

వలంటీర్లకు నియామక పత్రాల అందజేత



వలంటీర్లకు నియామక పత్రాలు అందజేస్తున్న సత్యనారాయణ తదితరులు

కాకినాడ రూరల్: మండలంలోని వివిధ గ్రామాల్లో ఖాళీగా ఉన్న వలంటీర్ పోస్టుల భర్తీ చేస్తూ పలువురికి నియోజకవర్గ అభివృద్ధి కమిటీ చైర్మన్ కురసాల సత్యనారాయణ గురువారం నియామక పత్రాలు అందజేశారు. రమణయ్యపేట వైద్యనగర్ క్యాంపు కార్యాలయంలో ఎంపీడీఓ శ్రీనివాస్ అధ్యక్షతన డీఎల్‌డీఓ నారాయణమూర్తితో ఆయన పాల్గొని 14 మందికి సదరు పత్రాలు అందించారు.

నూకాలమ్మ జాతర పోస్టర్ ఆవిష్కరణ

ఇంద్రపాలెంలో ఉగాదిని పురస్కరించుకుని కొత్త అమావాస్య రోజు నుంచి జరగనున్న నూకాలమ్మ జాతర ఉత్సవాల పోస్టరును కురసాల సత్యనారాయణ ఆవిష్కరించారు. కార్యక్రమంలో అనుసూరి ప్రభాకర్, గీసాల వీరబాబు తదితరులు పాల్గొన్నారు.

క్లినికల్ ల్యాబ్ స్థాపనకు రూ.50 వేల విరాళం



బాలకృష్ణకు రూ.50 వేల చెక్కు ఇస్తున్న సోము ప్రసాద్, స్వాతి, రాజ్‌కుమార్

బాలాజీచెరువు: డాక్టర్ బాదం బాలకృష్ణ క్లినికల్ ల్యాబ్ ఏర్పాటుకు దుర్గా సోముప్రసాద్ చారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపకుడు దుర్గా సోముప్రసాద్ కార్యాలయంలో సోముప్రసాద్ కుమార్తె అల్లుడు స్వాతి, రాజ్‌కుమార్ బాదం బాలకృష్ణకు రూ.50వేలు చెక్కును విరాళంగా అందజేశారు. బాలకృష్ణ మాట్లాడుతూ అతితక్కువ రేట్లకు ల్యాబ్ టెస్టులు నిర్వహించడానికి తలపెట్టిన ఈ ప్రాజెక్టుకు సోముప్రసాద్ వంటి దాతలు విరాళం ఇవ్వడం వల్ల ఈ ప్రాజెక్టు నిరంతరాయంగా కొనసాగుతుందన్నారు. దాతలు ఈ ప్రాజెక్టు నిర్మాణానికి సహకరించాలని కోరారు. ఆర్‌వీ రమణమూర్తి, ఏఎఆర్ మోహనరావు తదితరులు పాల్గొన్నారు.

సీటీ స్కానర్ సిద్ధం



స్కానింగ్ చేయించుకుంటున్న రోగి

సాక్షి ఎఫెక్ట్

కాకినాడ క్రైం: సాక్షి కథనానికి స్పందన వచ్చింది. కాకినాడ జీజీహెచ్‌లో 15 రోజులకు పైగా నిరుపయోగంగా ఉన్న సీటీ స్కానర్ ఎట్టకేలకు పనిచేస్తోంది. బుధవారం 'సాక్షి'లో ప్రచురితమైన 'సీటీ స్కానర్‌పై సత్వర చర్యలు తీసుకోండి' కథనానికి యంత్రాంగం కదిలింది. తక్షణమే స్పందించిన సీటీ స్కానర్ నిర్వహణ సంస్థ ఎస్ఎల్ డయాగ్నోస్టిక్స్ ప్రతినిధులు ఆగమేఘాలపై మరమ్మతులు చేసి అందుబాటులోకి తెచ్చారు. గురువారం 125 మందికి సీటీ స్కాన్లు చేసినట్టు గుమాస్తా కృష్ణ తెలిపారు.

టీడీపీ నేతల పర్యటన

కరప: వేములవాడ శివారు పోలినాటివారివీధిలో గురువారం ఇంటింటికీ మీ అనంతలక్ష్మి, ఇదేం కర్మ మనరాష్ట్రానికి కార్యక్రమాన్ని మాజీ ఎమ్మెల్యే పిల్లి అనంతలక్ష్మి నిర్వహించారు. టీడీపీ రాష్ట్రకార్యదర్శి పిల్లి సత్యనారాయణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

ట్రాఫిక్ పరీక్ష పాస్..



రమణయ్యపేట మోహన్ జూనియర్ కళాశాల వద్ద ట్రాఫిక్ సమస్య లేకుండా బందోబస్తు నిర్వహిస్తున్న పోలీసులు



వేళంగిలో పరీక్ష రాసి బయటకు వస్తున్న విద్యార్థులు

- ఇంటర్ పరీక్షా కేంద్రం వద్ద తప్పిన సమస్య
- ఏఎస్పీ పర్యవేక్షణలో చక్కదిద్దిన పోలీసులు
- హర్షం వ్యక్తం చేసిన విద్యార్థులు, తల్లిదండ్రులు



మోహన్ జూనియర్ కళాశాల వద్ద బుధవారం ఉదయం 8.30 సమయంలో వాహనాల రద్దీ..

సాక్షి ఎఫెక్ట్



పోలీసులు తీసుకున్న చర్యలతో గురువారం ఉదయం 8.30 సమయంలో ఇలా..

కాకినాడ రూరల్: ఇంటర్మీడియెట్ పబ్లిక్ పరీక్షలు రెండో రోజు ప్రశాంతంగా జరిగాయి. గురువారం విద్యార్థులు తెలుగు/సంస్కృతం పేపర్ రాశారు. రమణయ్యపేట ఈశ్వర్‌నగర్‌లోని మోహన్ జూనియర్ కళాశాల వద్ద ఏర్పాటు చేసిన సెంటర్‌లో బుధవారం మొదటి సంవత్సరం విద్యార్థులు ట్రాఫిక్‌లో చిక్కుకుని పరీక్ష కేంద్రానికి నడచివెళ్లాల్సి వచ్చిన సంగతి విదితమే. దీనిపై సాక్షిలో 'తొలిరోజే ట్రాఫిక్ పరీక్ష' శీర్షికన గురువారం ప్రచురితమైన కథనంపై జిల్లా పోలీసు ఉన్నతాధికారులు సీరియస్‌గా తీసుకున్నారు. అడ్మిన్ అడిషనల్ ఎస్పీ పి.శ్రీనివాస్ ఉదయం 8 గంటలకే మోహన్ జూనియర్ కళాశాల వద్దకు చేరుకుని పరిస్థితిని పరిశీలించారు. పిఠాపురం-కాకినాడ ప్రధాన రహదారి నుంచి ఈశ్వర్‌నగర్ కూడలి వద్ద పోలీసు బందోబస్తు లేనట్టు గుర్తించారు. ఈ కూడలి మీదుగా విద్యార్థులతో పాటు స్కూల్ బస్సులు ఒకేసారి వెళ్లడంతో ట్రాఫిక్ సమస్య ఏర్పడిన నేపథ్యంలో అక్కడ ట్రాఫిక్ కానిస్టేబుల్‌ను ఏర్పాటు చేశారు. అక్కడ నుంచి పరీక్షా కేంద్రానికి చేరుకుని బందోబస్తు పరిశీలించారు. ఈలోగా సర్పవరం ఎస్సై సతీష్‌బాబు, ఏఎస్సై నాగేశ్వరరావు అక్కడకు చేరుకోవడంతో తొలి రోజు ట్రాఫిక్ సమస్యపై వారిని సున్నితంగా మందలించి పాఠశాల బస్సులను ఒకదాని తరువాత మరోదానిని వదలాలని, ట్రాఫిక్ సమస్య ఎదురవకుండా చూడాలని ఆదేశించారు.

తొలి రోజే 20మంది గైర్హాజరు

ఇంటర్మీడియట్ రెండో సంవత్సరం విద్యార్థులు గురువారం తొలి పరీక్షగా తెలుగు/సంస్కృతం రాశారు. రూరల్ మండలంలో మూడు సెంటర్లలో 20 మంది గైర్హాజరయ్యారు. ఇంద్రపాలెం శాంతి నికేతన్ జూనియర్ కళాశాలలో 231 మందికి 226 మంది హాజరయ్యారు. రమణయ్యపేట స్వామి జూనియర్ కళాశాలలో 224 మందికి 221మంది హాజరయ్యారు. మోహన్ జూనియర్ కళాశాలలో 414మంది విద్యార్థులకు గాను 402మంది హాజరయ్యారు. మొత్తంగా ఈ గురువారం 20 మంది గైర్హాజరయ్యారు.

కరపలో..

కరప: మండలంలో వేళంగి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్ ద్వితీయ సంవత్సరం తెలుగు పేపర్-2 పరీక్ష ప్రశాంతంగా జరిగాయి. 67 మంది విద్యార్థులకు ఇద్దరు గైర్హాజరయ్యారు. పరీక్షా కేంద్రం సూపరింటెండెంట్, ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ జి.ధనకృష్ణారావు, డిపార్ట్‌మెంటల్ ఆఫీసర్ జెస్సీ డేనియల్ ఇతర సిబ్బంది పరీక్షల నిర్వహణకు అన్ని ఏర్పాట్లు చేసి, మాల్‌ప్రాక్టీస్ జరగకుండా పర్యవేక్షించారు. పీహెచ్‌సీ సిబ్బంది వైద్యశిబిరం నిర్వహించారు. ఎస్ఐ నౌడు రామకృష్ణ బందోబస్తు నిర్వహించారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

కరప: స్థానిక విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో మరమ్మతులు చేస్తున్నందువల్ల శుక్రవారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు కరప, పేపకాయలపాలెం గ్రామాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్టు డివిజన్ డీఈఈ జి.ప్రసాద్ తెలిపారు. కరపలో గురువారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడారు. కరప, పెనుగుదురు గ్రామాల మధ్య ఉన్న 11 కేవీ విద్యుత్‌లైన్‌లో దెబ్బతిన్న విద్యుత్‌స్తంభాల మార్పు, విద్యుత్ తీగల సవరింపు జరుగుతోందని, దీంతో కరప, పేపకాయలపాలెం గ్రామాల్లో విద్యుత్ సరఫరా ఉండదన్నారు. కరప ఏఈ సానా ఈశ్వరప్రసాద్, సబ్ ఇంజినీర్ టీవీఎస్ సత్యనారాయణ పాల్గొన్నారు.

19న ఉచిత కంటి వైద్యశిబిరం

కరప: స్థానిక ఎస్టేర్ పాఠశాల ప్రాంగణంలో 19వ తేదీన ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు ఉచిత మెగా కంటి వైద్యశిబిరం ఏర్పాటు చేసినట్టు నిర్వాహకులు కాకర్ల బుజ్జిబాబు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. కాకినాడ కిరణ్ కంటి ఆసుపత్రి సౌజన్యంతో ఈశిబిరం నిర్వహిస్తున్నామన్నారు. కంటి పరీక్షలు నిర్వహించి, ఆపరేషన్ అవసరమైన వారికి శస్త్ర చికిత్సలు చేయనున్నట్టు తెలిపారు. 30 సంవత్సరాలు దాటిన ప్రతి ఒక్కరూ ఈఅవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని నిర్వాహకులు కోరారు. శిబిరానికి వచ్చేవారు రేషన్‌కార్డు కానీ, ఆరోగ్యశ్రీ కార్డు కానీ, ఏదైనా గుర్తింపుకార్డు జెరాక్స్ కాపీలు తీసుకురావాలన్నారు.

లారీ ఢీకొని వ్యక్తి మృతి

కాకినాడ క్రైం: లారీ ఢీకొన్న ఘటనలో ఓ వ్యక్తి ప్రాణాలు కోల్పోయాడు. కాకినాడలో జరిగిన ఈ సంఘటనకు సంబంధించిన వివరాలివీ.. కాకినాడ గ్రామీణం చీడీలదిబ్బకు చెందిన వానపల్లి నాగరాజు (35) వంటపని చేస్తుంటాడు. గురువారం తెల్లవారుజామున తన ద్విచక్రవాహనంపై సులభ్‌కాంప్లెక్స్‌కు వెళ్లాడు. మార్గమధ్యలో బాలాజీ చెరువు కూడలి చేరేసరికి అటుగా వస్తున్న ఓ లారీ నాగరాజు ప్రయాణిస్తున్న ద్విచక్రవాహనాన్ని ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో నాగరాజు కిందికి పడిపోగా శరీరంపై నుంచి లారీ వెళ్లింది. తీవ్రగాయాలపాలైన క్షతగాత్రుడ్ని స్థానికులు గమనించి కాకినాడ జీజీహెచ్‌లో చేర్చగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. నాగరాజుకు భార్య కుమార్తె ఉన్నారు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు, కాకినాడ వన్ టౌన్ పోలీసులు కేసు నమోదు చేశారు.

ఆటోను ఢీకొన్న కారు

ఐదుగురికి గాయాలు

కాకినాడ క్రైం: పిఠాపురం నుంచి కాకినాడకు వస్తున్న ఓ ఆటోలో ప్రయాణికులను కారు ఢీకొట్టింది. గురువారం సాయంత్రం ఐదుగురు వ్యక్తులు పిఠాపురం నుంచి కాకినాడకు వచ్చేందుకు పిఠాపురంలో ఆటో ఎక్కారు. కొంత దూరం ప్రయాణించే సరికి వెనుక నుంచి భారీగా పొగరావడాన్ని గుర్తించిన డ్రైవరు వాహనాన్ని నిలిపి చూసేందుకు వెనక్కు వెళ్లబోయాడు. ఇంతలో అతి వేగంగా వస్తున్న కారు ఆటోను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఆటోలో ప్రయాణిస్తున్న ఐదురుగు గాయాలపాలయ్యారు. వారిని స్థానికులు గురువారం రాత్రి కాకినాడ జీజీహెచ్‌కు తరలించారు. సామర్లకోట మండలం పండ్రవాడ వద్ద జరిగిన ఈ ప్రమాదంలో మహ్మద్ నయీం, సాదీ నూకరత్న సుజ్ఞాన మణి, చిట్టుమూరి గన్నమ్మ, చిట్టుమూరి శ్రీజ, దడాల సుజాత గాయాలపాలయ్యారు. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేశారు.

సర్వే త్వరగా పూర్తి చేయాలి



అరట్లకట్ట సచివాలయంలో గ్రౌండ్ వాల్యూయేషన్ ప్రక్రియను పరిశీలిస్తున్న తహసీల్దార్ శ్రీనివాసరావు

కరప: జగనన్న భూరక్ష సమగ్ర రీసర్వే త్వరగా పూర్తి చేయాలని తహసీల్దార్ పి.శ్రీనివాసరావు సూచించారు. మండలంలోని అరట్లకట్ట, పెద్దాపురప్పాడు గ్రామాల్లో గురువారం ఆయన పర్యటించి గ్రౌండ్ వాల్యూయేషన్‌ను పరిశీలించి సూచనలు చేశారు. మండల పరిధిలో 19 రెవెన్యూ గ్రామాలుండగా 15 గ్రామాల్లో రీసర్వే పూర్తికాగా, మక్కురాళ్లు పాతించే పనులు జరుగుతున్నాయని తహసీల్దార్ అన్నారు. అరట్లకట్ట, పెద్దాపురప్పాడు గ్రామాల్లో గ్రౌండ్ వాల్యూయేషన్ జరుగుతోందన్నారు. ఇది పూర్తయితే వీఆర్వో లాగిన్, తహసీల్దార్ లాగిన్, డ్రాఫ్ట్ ల్యాండ్ రికార్డు పనులు పూర్తిచేసి, ఆర్డీఓ, జేసీ కార్యాలయాలకు పంపించడం జరుగుతుందన్నారు. తర్వాత 13 నోటిఫికేషన్ జారీచేసి, రైతుల నుంచి అభ్యంతరాలు స్వీకరించి, సవరణలుంటే సరిచేస్తామన్నారు. తర్వాత పొలాల సరిహద్దుల్లో మక్కురాళ్లు పాతించనున్నట్టు ఆయన తెలిపారు. రీసర్వే డీటీ కె.సురేష్‌కుమార్, ఆర్ఐ పేపకాయల మాచరావు, వీఆర్వో బి.దేవి, విలేజ్ సర్వేయర్ ఎస్.అంజిబాబు పాల్గొన్నారు.

వేసవిలో నీటి ఎద్దడి లేకుండా చర్యలు

- కార్పొరేషన్ కమిషనర్ రమేష్
- వేసవి జలాశయం సందర్శన



అరట్లకట్ట వేసవి జలాశయాన్ని పరిశీలిస్తున్న కమిషనర్ రమేష్

కాకినాడ: రానున్న వేసవిలో తాగునీటి ఎద్దడి ఏర్పడకుండా అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటున్నామని నగరపాలక సంస్థ కమిషనర్ కె.రమేష్ చెప్పారు. గురువారం ఆయన వాటర్ వర్క్స్ అధికారులతో అరట్లకట్ట వేసవి జలాశయాన్ని, సామర్లకోట సాంబమూర్తి రిజర్వాయర్‌ను పరిశీలించారు. గోదావరి జలాల లభ్యత, నీటినిల్వల సామర్థ్యం, వేసవి కార్యాచరణపై అధికారులతో చర్చించారు. అరట్లకట్టలో జరుగుతున్న పూడికతీత పనులను పరిశీలించారు. 25వ తేదీ నాటికి పూడిక తీసి వేసవి జలాశయంలో నీటిని నింపేందుకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అలాగే సామర్లకోట సాంబమూర్తి రిజర్వాయర్‌లో గోదావరి జలాల లభ్యతపై మాట్లాడుతూ వేసవిలో తాగునీటి కొరత ఏర్పడకుండా అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటున్నామన్నారు. సుమారు 45 రోజుల పాటు మంచినీటిని నిల్వ చేసుకునే సామర్థ్యం అందుబాటులో ఉందని చెప్పారు. గోదావరి కాలువ తెరిచే వరకు కాకినాడ ప్రజల అవసరాల మేరకు మంచినీటిని సమృద్ధిగా నిల్వచేసి సరఫరా చేస్తామన్నారు. ఇందుకోసం వేసవి కార్యాచరణ సిద్ధం చేస్తామన్నారు. ఆయన వెంట వాటర్ వర్క్స్ ఈఈ (ఎఫ్ఏసీ) ప్రభాకర్, ఏఈ ఎం.రమేష్ బాబు ఉన్నారు.

ఐడియల్‌లో రక్తదాన శిబిరం



రక్తదానం చేస్తున్న దాతలు

బాలాజీచెరువు: స్థానిక విద్యుత్‌నగర్‌లోని ఐడియల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీలో రెడ్‌క్రాస్, కళాశాల ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం నిర్వహించారు. డాక్టర్ దుర్గారావు పర్యవేక్షణలో విద్యార్థులు రక్తదానం చేశారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ టి.శ్రీకాంత్ శిబిరాన్ని ప్రారంభించి రక్తదాన ఆవశ్యకతను వివరించారు. డైరెక్టర్ జీవీ కృష్ణంరాజు, అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ జీవీకే వర్మ, కలశాల ఉపాధ్యాయులు 60 యూనిట్ల ర క్తాన్ని దానంచేసిన వారిని అభినందించారు. కళాశా ల అధికారి కృష్ణన్ విద్యార్థులకు కృతజ్ఞతలు తెలిపారు.

కనకదుర్గ ఆలయంలో హుండీల లెక్కింపు

బోట్‌క్లబ్: స్థానిన సంతచెరువు వద్ద ఉన్న కనకదుర్గ అమ్మవారి ఆలయ హుండీలను గురువారం దేవదాయశాఖ అధికారులు సమక్షంలో లెక్కించారు. మూడు నెలల 15 రోజులకు రూ.1.49 లక్షల ఆదాయం వచ్చినట్లు ఆలయ ఈఓ చింతపల్లి విజయభాస్కర్‌రెడ్డి తెలిపారు. దేవదాయశాఖ కాకినాడ డివిజన్ ఇన్‌స్పెక్టర్ వడ్డి ఫణికుమార్, బాలాత్రిపుర సుందరి సేవా సమితి సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

ఇదేం చెత్తపని?

- కమిషనర్ రమేష్ అసహనం
- పారిశుద్ధ్య పనుల తనిఖీ
- ప్రజా సహకారంతోనే తమ సేవలకు గుర్తింపని హితవు



చిన్నమార్కెట్ ప్రాంతంలో పారిశుద్ధ్య పనులపై ఆరా తీస్తున్న కమిషనర్ రమేష్

కాకినాడ: 'చెత్త' ను ఇలా రోడ్లపై వేస్తే ఎలా? ఇది సరైన విధానం కాదు, మరోసారి ఇలాంటి పరిస్థితి పునరావృతం కాకుండా చూసుకోండి. అంటూ నగరపాలక సంస్థ కమిషనర్ కె.రమేష్ కొందరి తీరుపై అసహనం వ్యక్తం చేశారు. గురువారం ఆయన కాకినాడ ఆరో సర్కిల్ పరిధిలోని 22వ డివిజన్ చిన్న మార్కెట్ ప్రాంతంలో పారిశుద్ధ్య పనులను తనిఖీ చేశారు. మసీదు ప్రాంతంలో చెత్తను పారిశుద్ధ్య కార్మికులకు ఇవ్వకుండా రోడ్డు పక్కనే వేయడాన్ని గుర్తించారు. ఇలా వేసిన వారిని పిలిచి మరోసారి ఇలా చేయవద్దని కోరారు. ఈ విషయంలో స్థానికంగా ఉండే వ్యాపారులు, ప్రజల్లో మరింత చైతన్యం కల్పించేలా శానిటరీ ఇన్‌స్పెక్టర్లు, కార్యదర్శులు ప్రత్యేక చొరవ తీసుకోవాలని కమిషనర్ కోరారు. ప్రజల సహకారంతోనే నగరపాలక సంస్థ అందించే సేవలకు తగిన ప్రయోజనం ఉంటుందన్నారు. ఎట్టి పరిస్థితుల్లోనూ ప్రజలు తడి, పొడి చెత్తను వేర్వేరుగా విభజించి కార్మికులకు అందజేయాలని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో కమిషనర్ వెంట శానిటరీ ఇన్‌స్పెక్టర్లు వైఆర్ఎల్ రెడ్డి, ధర్మాజీ, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

శానిటరీ సెక్రటరీకి షోకాజ్



పూడికతీత పనులను పరిశీలిస్తున్న ఏడీసీ నాగనరసింహారావు

కాకినాడ: ఏడీసీ సీహెచ్ నాగ నరసింహారావు గురువారం రెండో సర్కిల్ పరిధిలోని భాస్కర్ నగర్, శాంతినగర్ ప్రాంతాలలో పారిశుద్ధ్య పనులను తనిఖీ చేశారు. కొన్నిచోట్ల చెత్త తొలగింపులో సిబ్బంది అలసత్వాన్ని గుర్తించి, క్షేత్రస్థాయి సిబ్బంది తీరుపై అసహనం వ్యక్తం చేశారు. ఇందుకు కారణమైన అక్కడి శానిటరీ సెక్రటరీ సూర్యకు షోకాజ్ నోటీస్ ఇవ్వాలని ఆదేశించారు. పారిశుద్ధ్య సేవలు లోపిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఆయన వెంట శానిటరీ సూపర్‌వైజర్ జిలాని, సచివాలయ సిబ్బంది ఉన్నారు.

ట్రాఫికింగ్‌లకు కౌన్సెలింగ్

- వాట్సాప్ గ్రూప్ ద్వారా సమాచార ప్రసారం
- వాహన తనిఖీలకు దొరక్కుండా పక్కదారులు
- ఆపై కొందరు పోలీసులే లక్ష్యంగా దూషణలు
- అడ్మిన్‌లకు కౌన్సెలింగ్ ఇచ్చిన అధికారులు



యువతకు కౌన్సెలింగ్ ఇస్తున్న ట్రాఫిక్ డీఎస్పీ వెంకటేశ్వరరావు

కాకినాడ క్రైం: నగరానికి చెందిన కొందరు యువత ప్రత్యేక వాట్సాప్ గ్రూప్‌లు ఏర్పాటు చేసి ఎక్కడెక్కడ వాహనాల తనిఖీ జరుగుతోందన్న సమాచారాన్ని ఇచ్చి పంచుకుంటున్నారని డీఎస్పీ వెంకటేశ్వరరావు అన్నారు. ఈ మేరకు గురువారం ట్రాఫిక్-2 పీఎస్‌లో ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, బాధ్యరాహిత్యంగా వ్యవహరిస్తున్న కొందరు ట్రాఫిక్ తనిఖీలను తప్పించుకునేందుకు ప్రత్యామ్నాయ మార్గాల్లో వెళ్తున్నారన్నారు. వాట్సాప్ వేదికగా ట్రాఫిక్ పోలీసులను అసభ్యపదజాలంతో దూషిస్తూ గ్రూపుల్లో మెసేజ్‌లు షేర్ చేసుకుంటున్నారని తెలిపారు. వీరిలో కొందరు బైక్ రేసింగ్‌లలో పాల్గొంటున్నారని, మరి కొందరు నంబర్ ప్లేట్లు తొలగించి వాహనాలు నడుపుతున్నారని అన్నారు. వాట్సాప్ గ్రూపు అడ్మిన్‌లు, సభ్యులు వారి తల్లిదండ్రులను పిలిపించి కౌన్సెలింగ్ నిర్వహించామని తెలిపారు. ఇకపై అటువంటి గ్రూపులు నిర్వహించే అడ్మిన్‌లతో పాటు గ్రూప్ సభ్యులపైగా చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని తెలిపారు. ట్రాఫిక్ సీఐ చైతన్యకృష్ణ ఆధ్వర్యంలో వారం రోజుల వ్యవధిలో నిర్వహించిన తనిఖీల్లో 41 మందిపై డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులు నమోదు చేశామని డీఎస్పీ తెలిపారు. వారిలో 35 మందికి కోర్టు తలో రూ.10 వేలు చొప్పున జరిమానా విధించగా, మిగిలిన ఆరుగురికి వారం రోజుల చొప్పున జైలు శిక్ష విధించిందని తెలిపారు.

ఇంటి పన్నుల్లో డబుల్ ఎంట్రీలుంటే తొలగించవచ్చు

మున్సిపల్ ఆర్డీ సత్యనారాయణ

పిఠాపురం: మున్సిపాలిటీ పరిధిలోని డబుల్ ఎంట్రీ ఇంటి పన్నులు ఉంటే వాటిని కౌన్సిల్ అనుమతితో కమిషనర్ తొలగించవచ్చని మున్సిపల్ ఆర్డీ ఎస్‌వీవీ సత్యనారాయణ తెలిపారు. పిఠాపురం మున్సిపల్ కార్యాలయాన్ని ఆయన గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. రికార్డులు తనిఖీ చేసి కార్యాలయంలో ప్రజలకు అందుతున్న సేవలపై ఆరా తీశారు. పన్నుల వసూళ్ల తీరును పరిశీలించారు. పన్నుల వసూలు విషయంలో తీసుకుంటున్న చర్యలపై సిబ్బందితో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పన్నుల వసూళ్లలో ప్రగతి సాధించాలన్నారు. పిఠాపురం మున్సిపాలిటీ పరిధిలో ఇప్పటివరకూ 60 శాతం పన్నులు వసూలు అయ్యాయని, మార్చి 31 నాటికి 85 శాతం పూర్తవుతాయని ఆయన తెలిపారు. తమ రీజియన్ పరిధిలో 65 శాతం పన్నులు కాగా 90 శాతం పూర్తవుతాయన్నారు. ఇంటి పన్ను చెల్లింపు విషయంలో ఎటువంటి రాయితీలు ఉండవని ఆయన తెలిపారు. రీజియన్ పరిధిలో ఉన్న ఉయ్యూరు మున్సిపాలిటీ పన్నుల వసూళ్లలో ఆఖరి స్థానంలో ఉందని ఆయన తెలిపారు. రాష్ట్రంలో అన్ని పట్టణాల్లోనూ డ్రోన్ల ద్వారా రీ సర్వే జరుగుతోందని, వందేళ్ల నాటి ఆర్ఎస్ఆర్ సర్వేకి అనుగుణంగా నూతనంగా సర్వే చేసి ప్రతి ఇంటికీ గృహ హక్కు పత్రం ఇస్తారని వివరించారు.

అమరవీరులకు జోహార్లు



అమరులైన సీపీఎం నాయకులకు జోహార్లు అర్పిస్తున్న నాయకులు

కాకినాడ సిటీ: అమరులైన కమ్యూనిస్టు పార్టీ నేతలకు నాయకులు గురువారం జోహార్లు అర్పించారు. దివంగత ఇనుగంటి నారాయణరావు, జీఎస్ బాలాజీదాస్, తోరాటి లక్ష్మణమూర్తి, వాసంశెట్టి సూర్యారావు, బీబీ నాయుడు, గుండపు చిట్టియ్య, కుడుపూడి సూర్యనారాయణ, ఇనుగంటి రామతులసమ్మ, వాసంశెట్టి మాతాజీలకు స్థానిక సుందరయ్యభవన్‌లో వారు నివాళులు అర్పించారు. సభ అనంతరం వర్తమానంలో మార్క్సిజం ఔన్నత్యంపై ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించారు. నాయకులు మోర్త రాజశేఖర్, చింతపల్లి అజయ్‌కుమార్, తిరుమలశెట్టి నాగేశ్వరరావు, ఉప్పాడ సత్యనారాయణ, టి.రాజా, సూరిబాబు, సీహెచ్ రమణి, శివరాజ వి.చంద్రరావు, గుత్తుల రామకృష్ణ పాల్గొన్నారు.

చిరస్మరణీయుడు అమరజీవి



పొట్టి శ్రీరాములు చిత్రపటానికి నివాళులర్పిస్తున్న కురసాల సత్యనారాయణ, డీఎల్‌డీఓ నారాయణమూర్తి



కరప మండల పరిషత్ కార్యాలయంలో..

కాకినాడ రూరల్: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సాధనకు ప్రాణత్యాగం చేసిన అమరజీవి పొట్టి శ్రీరాములు తెలుగువారి చిర స్మరణీయుడని నియోజకవర్గ అభివృద్ధి కమిటీ చైర్మన్ కురసాల సత్యనారాయణ పేర్కొన్నారు. రమణయ్యపేట వైద్యనగర్ క్యాంపు కార్యాలయంలో గురువారం ఉదయం డీఎల్‌డీఓ నారాయణమూర్తితో కలిసి ఆయన పొట్టి శ్రీరాములు చిత్ర పటానికి నివాళులర్పించారు. వక్ఫ్ బోర్డు డైరెక్టరు కరీం బాష, బీసీ శెట్టి బలిజ కార్పొరేషన్ డైరెక్టరు అనుసూరి ప్రభాకర్, వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొన్నారు. సెట్రాజీ కార్యాలయంలో సీఈఓ షేక్ ఇమ్రాన్, మేనేజరు కాశీ విశ్వేశ్వరరావు, జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ కోచ్ అమరజీవికి నివాళులర్పించారు. అలాగే అర్బన్ 3వ డివిజన్ గుడారిగుంటలో మాజీ కార్పొరేటరు వడ్డి మణికుమార్, వైఎస్సార్ సీపీ నాయకులు, బోట్‌క్లబ్ వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో అడబాల రత్నప్రసాద్ తదితరులు అమరజీవికి నివాళులు అర్పించారు.

కరప మండల కార్యాలయంలో..

కరప: మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో గురువారం ఏఓ గుత్తుల భీమశంకరరావు సిబ్బందితో కలసి అమరజీవికి నివాళులు అర్పించారు. వైఎస్సార్‌సీపీ మండలయూత్ అధ్యక్షుడు పెంకే సత్తిబాబు, కార్యాలయం సిబ్బంది వీరేష్, రాయుడు, సురేష్ తదితరులు పాల్గొన్నారు. తహసీల్దార్ కార్యాలయంలో శ్రీరాములు చిత్రపటానికి తహసీల్దార్ పి.శ్రీనివాసరావు నివాళులర్పించారు. ఆర్ఐ పేపకాయల మాచరావు, వీఆర్వోలు, సిబ్బంది పాల్గొన్నారు.

శ్రీరాములు త్యాగం మరువలేనిది



శ్రీరాములు చిత్రపటానికి నివాళులు అర్పిస్తున్న జెడ్పీ చైర్మన్ విప్పర్తి వేణుగోపాలరావు, ఉద్యోగులు

కాకినాడ సిటీ: జెడ్పీ కార్యాలయంలో చైర్మన్ విప్పర్తి వేణుగోపాలరావు చాంబర్‌లో చైర్మన్ విప్పర్తి, జెడ్పీ సీఈవో ఎన్‌వీవీ సత్యనారాయణ, పలువురు ఉద్యోగులు అమరజీవి పొట్టి శ్రీరాములు చిత్రపటానికి నివాళులర్పించారు. ఆంధ్రరాష్ట్రం ఏర్పాటులో ఆయన త్యాగం మరువలేనిదని వారు పేర్కొన్నారు డిప్యూటీ సీఈవో ఎ.రమణారెడ్డి, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఆర్డీవో కార్యాలయంలో..

ఆర్డీవో బీవీ రమణ ఆధ్వర్యంలో ఆయన కార్యాలయంలో అమరజీవి పొట్టి శ్రీరాములు జయంతి నిర్వహించి అమరజీవి చిత్రపటానికి నివాళులు అర్పించారు.